



TGTEL/26/A2435

# DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక



02

ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 12 | 24-05-2026 ఆదివారం | పేజీలు: 04 | వెల: 3/-

# ఫ్యూచర్ సిటీ రద్దు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

## బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర విమర్శలు

రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన వైఖరి చెప్పాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్
ఇలాంటి వ్యాఖ్యలు పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరిక
ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలకు అనుమతి ఉండదని స్పష్టీకరణ
అభివృద్ధి ప్రాజెక్టులపై అనవసర అనిశ్చితి సృష్టిస్తున్నారని ఆరోపణ
రాష్ట్రంలో బీఆర్ఎస్ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు చేస్తోందని విమర్శ
ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే ప్రతిపక్షం విమర్శలకే పరిమితమైందని వ్యాఖ్య
జంట నగరాల మెట్రో విస్తరణను కూడా అడ్డుకుంటున్నారని ఆరోపణ
పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన
అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటే ప్రజలు గమనిస్తారని మంత్రి హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేయాలనుకుంటున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన దృక్పథం లేకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలా? లేక వెనక్కి నెట్టాలా? అన్నది బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టంగా చెప్పాలని ఆయన ప్రశ్నించారు.
ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులపై అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం వల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం తగ్గుతుందని, దాని ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడుతుందని మంత్రి హెచ్చరించారు. ఒక రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే స్థిరమైన విధానాలు, స్పష్టమైన అభివృద్ధి దిశ అవసరమని ఆయన పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు ఇటువంటి కీలక ప్రాజెక్టులపై వ్యతిరేక వ్యాఖ్యలు ..మిగతా 2లో

# యాదగిరిగుట్టలో వేదపాఠశాలకు సీఎం శంకుస్థాపన



యాదగిరిగుట్టలో సంప్రదాయ వేదపాఠశాలకు శ్రీకారం
కంచి పీఠాధిపతి సమక్షంలో శంకుస్థాపన
రూ.43.79 కోట్లతో 15 ఎకరాల్లో వేదపాఠశాల నిర్మాణం
రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతుల ప్రారంభం లక్ష్యం
నిత్య కల్యాణం, రంగ మండపం పనులకు సీఎం శంకుస్థాపన
మెట్ల మార్గానికి పైకప్పు నిర్మాణానికి ప్రత్యేక నిధులు
మాఢవీధులకు మెట్లు నిర్మించనున్న దేవాదాయ శాఖ
దీక్షాపరుల మండపం పనులకు రూ.43.5 కోట్ల కేటాయింపు
శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధుల పాల్గొనడం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరి గుట్టలోలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సంప్రదాయ వేద విద్య పరిరక్షణకు కీలకంగా నిలిచే వేదపాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.43.79 కోట్ల నిధులను కేటాయించింది. సంప్రదాయ వేద విద్యతో పాటు ఆధునిక సదుపాయాలు కలిగిన విద్యాసంస్థగా దీన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసి తరగతులను ప్రారంభించనున్నట్టు అధికారులు వెల్లడించారు.
వేదపాఠశాలలో విద్యార్థులకు వసతి, భోజనం, ..మిగతా 2లో



## 10 ఏళ్ల బాలిక దారుణ హత్య.. స్పందించిన సీఎం విజయ్

కోయంబత్తూర్‌లో దుకాణానికి
వెళ్లిన 10 ఏళ్ల బాలిక అదృశ్యం
అనంతరం చెరువులో బాలిక మృతదేహం గుర్తింపు
ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన, నిరసనలు
పోలీసులు రెండు నిందితులు కార్తీక్,
మోహన్‌రాజ్‌ను అరెస్ట్ చేశారు
ఓ వ్యక్తి బైక్‌పై తీసుకెళ్లినట్లు
దర్యాప్తులో కీలక ఆధారాలు
తీవ్రంగా ఖండించిన తమిళనాడు ముఖ్యమంత్రి
నిందితులకు కఠిన శిక్ష పడేలా
వేగవంత దర్యాప్తునకు హామీ

**కోయంబత్తూర్, (డిడి9 వార్త):**

తమిళనాడులోని కోయంబత్తూర్‌లో 10 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. దుకాణానికి వెళ్లి అదృశ్యమైన ..మిగతా 2లో

## సర్ పేరుతో ఓట్లను తొలగిస్తే ఊరుకోం

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ వెల్లడి
ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే
చర్యలకు కాంగ్రెస్ పార్టీ అంగీకరించదు
పశ్చిమ బెంగాల్‌లో 31 లక్షల ఓట్లు
చేర్చి 93 లక్షల ఓట్లు తొలగింపు
ఓటర్ల జాబితా మార్పుల కారణంగా
టీఎంసీ ఓటమికి దారితీసిందని వ్యాఖ్య
తెలంగాణలో ఇలాంటి
పరిస్థితులు రాకుండా జాగ్రత్తలు
అవసరమని అభిప్రాయం
రాష్ట్రంలో ధాన్యం దిగుబడి
పెరగడంతో కొనుగోళ్లలో
కొంత జాప్యం జరిగినట్టు వివరణ
రైతుల సమస్యలను పరిష్కరించేందుకు
ప్రభుత్వం చర్యలు
తీసుకుంటోందని ప్రకటన
తన పనితీరును ఏఐసీసీ లేదా
ముఖ్యమంత్రి అంచనా వేస్తారని వ్యాఖ్య
పార్టీ నాయకత్వ మార్పులపై
తుది నిర్ణయం ఏఐసీసీదేనని స్పష్టీకరణ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అక్రమంగా ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగితే కఠినంగా అడ్డుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే ఎలాంటి చర్యలకైనా కాంగ్రెస్ పార్టీ అంగీకరించదని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓటర్ల జాబితా మార్పులను ఉదాహరణగా చూపిస్తూ, అక్కడ 31 లక్షల ఓట్లు ..మిగతా 2లో

## దేశంలో తొలి ఏఐ ఫిర్యాదు యాప్‌ను ఆవిష్కరించిన సీపీ సజ్జనార్

హైదరాబాద్‌లో తొలి ఏఐ ఆధారిత పోలీస్ ఫిర్యాదు యాప్ ఆవిష్కరణ
'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను ప్రారంభించిన సీపీ సజ్జనార్
10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే సదుపాయం
వాయిస్‌ను వెంటనే టెక్ట్స్‌గా మార్చే ఏఐ టెక్నాలజీ
ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్‌గా సేవ్
వలస కార్మికులు, మహిళలకు పెద్ద ఊరటగా యాప్
భాష సమస్యలు తొలగించడమే లక్ష్యమన్న పోలీస్ శాఖ
హైదరాబాద్‌లో 80కి పైగా స్టేషన్లలో ప్రారంభం
ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసే అవకాశం
బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్‌తో యాప్ అభివృద్ధి



02

## వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం

తీవ్ర వడగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
వచ్చే మూడు రోజులు వృద్ధులు, పిల్లలు బయటకు రావొద్దని విజ్ఞప్తి
సచివాలయంలో వడగాలుల
పరిస్థితిపై అత్యవసర సమీక్ష నిర్వహించిన మంత్రి
అధిక ఉష్ణోగ్రతలు ఉన్న మండలాలు,
గ్రామాల్లో ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని ఆదేశం
బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన రహదారుల్లో
మజ్జిగ, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని సూచన
వడగాలుల ప్రభావంతో పలు జిల్లాల్లో
మృతులు నమోదు అయినట్లు అధికారుల నివేదిక
వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం
ప్రకటించిన ప్రభుత్వం
కలెక్టర్లు వ్యక్తిగతంగా పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రి ఆదేశం
అత్యవసర వైద్య సేవలు సిద్ధంగా ఉంచి వెంటనే చికిత్స
అందించాలని సూచన
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా వచ్చే మూడు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎండలు, వడగాలుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సచివాలయంలో ఆయన అత్యవసర సమీక్ష నిర్వహించి అధికారులకు పలు ..మిగతా 2లో

## పెద్దికి పర్సంటేజ్ కావాల్సిందే

తెలంగాణలో సినిమాలు పర్సంటేజ్
విధానంలోనే విడుదల చేయాలన్న ఎగ్జిబిటర్ల డిమాండ్
హైదరాబాద్‌లో తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో కీలక సమావేశం
రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాకు
కూడా పర్సంటేజ్ తప్పనిసరి అన్న ఎగ్జిబిటర్లు
రెంటల్ విధానం వల్ల థియేటర్
యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు ఆరోపణ
నిర్మాతలకు అనేక మార్గాల్లో ఆదాయం వస్తోందని ఎగ్జిబిటర్ల వాదన
దేశవ్యాప్తంగా పర్సంటేజ్ విధానం అమల్లో ఉందని వెల్లడి
రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తామన్న
హామీలు అమలు కాలేదని ఎగ్జిబిటర్ల అసంతృప్తి
థియేటర్ల ఆదాయ ఆధారంగా
గ్రేడింగ్ విధానం అమలు చేయాలని ప్రతిపాదన
టికెట్ రేట్ల పెంపును తెలంగాణలో అనుమతించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి
'పెద్ది' విడుదల, టికెట్ రేట్లపై నైజాంలో కొనసాగుతున్న సందిగ్ధత



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో సినిమా థియేటర్ నిర్వహణలో కొనసాగుతున్న రెంటల్ విధానానికి ఇక ముగింపు పలికి, పర్సంటేజ్ విధానం తప్పనిసరి చేయాలనే దిశగా ఎగ్జిబిటర్లు స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో జరిగిన ఎగ్జిబిటర్ల సమావేశంలో ఈ కీలక నిర్ణయం ..మిగతా 2లో

# యాదగిరిగుట్టలో వేదపాఠశాలకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి

అధ్యయనానికి అనుకూలమైన వాతావరణం కల్పించనున్నారు. వేదాలు, ఆగమ శాస్త్రాలు, సంస్కృత విద్య అభ్యసించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఆధ్యాత్మిక విద్యా అభివృద్ధికి ఈ సంస్థ కీలక కేంద్రంగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే సందర్భంగా యాదగిరిగుట్ట క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన మరికొన్ని కీలక పనులకు కూడా సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.9.88 కోట్ల వ్యయంతో కొండపై నిత్య కల్యాణం, రంగ మండపం నిర్మాణ పనులను ప్రారంభించారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఈ సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

అలాగే కొండపైకి వెళ్లే మెట్ల మార్గంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా పైకప్పు నిర్మాణానికి రూ.1.41 కోట్ల నిధులు కేటాయించారు. వర్షం, ఎండల నుంచి రక్షణ కల్పించేలా ఈ పనులు చేపట్టనున్నారు. భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మాఢవీధులకు మెట్లు నిర్మించేందుకు రూ.1.44 కోట్లతో పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా దీక్షాపరుల కోసం ప్రత్యేక మండప నిర్మాణానికి రూ.43.5 కోట్లతో భారీ ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన చేశారు. దీక్షలు చేపట్టే భక్తులకు మరింత సౌకర్యవంతమైన వసతి, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు ఈ మండపం ఉపయోగపడనుంది.

అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో



ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్టు సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. యాదగిరిగుట్టను దేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు.

# దేశంలో తొలి ఏఐ ఫిర్యాదు యాప్‌ను ఆవిష్కరించిన సీపీ సజ్జనార్

- **హైదరాబాద్‌లో తొలి ఏఐ ఆధారిత పోలీస్ ఫిర్యాదు యాప్ ఆవిష్కరణ**
- **'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను ప్రారంభించిన సీపీ సజ్జనార్**
- **10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే సదుపాయం**
- **వాయిస్‌ను వెంటనే టెక్‌ట్స్‌గా మార్చే ఏఐ టెక్నాలజీ**
- **ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్‌గా సేవ్**
- **వలస కార్మికులు, మహిళలకు పెద్ద ఊరటగా యాప్**
- **భాష సమస్యలు తొలగించడమే లక్ష్యమన్న పోలీస్ శాఖ**
- **హైదరాబాద్‌లో 80కి పైగా స్టేషన్లలో ప్రారంభం**
- **ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసే అవకాశం**
- **బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్‌తో యాప్ అభివృద్ధి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశంలోనే తొలి ఏఐ ఆధారిత పోలీస్ ఫిర్యాదు నమోదు వ్యవస్థగా 'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా పౌరులు తమ ఫిర్యాదులను సులభంగా, వేగంగా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను పోలీస్ సేవల్లో వినియోగించడంలో ఇది ఒక కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, 10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉంది. పౌరుడు తనకు అనుకూలమైన భాషలో చెప్పిన విషయాలను యాప్ వెంటనే టెక్‌ట్స్‌గా మార్చి సంబంధిత భాషలోకి అనువదిస్తుంది. దీంతో భాష సమస్య కారణంగా ఫిర్యాదు నమోదు చేయలేని పరిస్థితులు ఇకపై ఉండవని అధికారులు తెలిపారు.

ఫిర్యాదు నమోదు అయిన వెంటనే అన్ని వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఇందులో ఉంది. ఇది కేసు నమోదు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా చేస్తుందని సీపీ సజ్జనార్ వివరించారు. డిజిటల్ రికార్డింగ్ వల్ల తప్పిదాలు తగ్గుతాయని కూడా ఆయన పేర్కొన్నారు. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులు వంటి వర్గాలకు ఈ యాప్ పెద్ద ఊరట కలిగిస్తుందని పోలీస్ శాఖ భావిస్తోంది. భాష తెలియకపోవడం వల్ల ఇప్పటివరకు ఎదురైన ఇబ్బందులు ఇకపై ఉండవని అధికారులు తెలిపారు. భాష న్యాయానికి అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో ఈ ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్టు చెప్పారు.

ప్రస్తుతం ఈ యాప్‌ను తొలుత హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అమలు చేయనున్నట్టు ప్రకటించారు. పౌరులు స్టేషన్‌కు వెళ్లిన వెంటనే ఫిర్యాదు నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయగలుగుతారని తెలిపారు. దీనివల్ల ఎఫ్ఐఆర్ నమోదు మరింత సులభం, ఖచ్చితంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యాప్‌ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సహకారంతో అభివృద్ధి చేసినట్టు పోలీసులు వెల్లడించారు. పోలీసింగ్ వ్యవస్థను ఆధునికీకరించడంలో ఇది ఒక కొత్త మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని డిజిటల్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నట్టు తెలిపారు.

# 'పెద్ది'కి పర్సంటేజ్ కావాల్సిందే

మొదటిపేజీ తరువాయి

వెలువడింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల నేపథ్యంలో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎగ్జిబిటర్లు ఇకపై తెలంగాణలో విడుదలయ్యే ప్రతి సినిమాకు పర్సంటేజ్ విధానం తప్పనిసరిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇప్పటికే తెలుగు ఫిలిం ఛాంబర్ కమిటీతో పలు దఫాలు చర్చలు జరిగినప్పటికీ, స్పష్టమైన పరిష్కారం రాలేదని వారు ఆరోపించారు. గతంలో 'హరి హర వీరమల్లు' విడుదల సమయంలో ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని వారు విమర్శించారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ, గతంలో పలు దఫాలు చర్చలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం దిశగా ఎలాంటి పురోగతి కనిపించలేదని తెలిపారు. నిర్మాతల వైపు నుంచి ఆలస్యం జరుగుతోందని, మొదట మూడు వారాల్లో పరిష్కారం చేస్తామని చెప్పి ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.


ప్రస్తుతం థియేటర్ యజమానులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని, సుమారు 120 మంది థియేటర్ ఓనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎగ్జిబిటర్లు తెలిపారు. గతంలో థియేటర్లకు మంచి ఆదాయం ఉండేదని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాతలకు అనేక మార్గాల్లో ఆదాయం వస్తోందని, కానీ ఎగ్జిబిటర్లకు మాత్రం పరిమిత ఆదాయం మాత్రమే ఉందని వారు విమర్శించారు. ఈ నేపథ్యంలో రెంటల్ విధానానికి బదులుగా పర్సంటేజ్ విధానం అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

థియేటర్ నిర్వహణలో సౌండ్ సిస్టమ్, ఏసీ వంటి అంశాల ఆధారంగా కాకుండా, కలెక్షన్ల ఆధారంగా గ్రేడింగ్ విధానం అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ విధానానికి మాత్రమే తాము సిద్ధమని స్పష్టం చేశారు.

'పెద్ది' సినిమా విషయంలో ప్రత్యేకంగా టికెట్ రేట్ల పెంపును తెలంగాణలో అనుమతించవద్దని ఎగ్జిబిటర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రేట్ల పెంపు ఉండవచ్చని, తెలంగాణలో మాత్రం సాధారణ రేట్లే ఉండాలని వారు కోరారు.

ఈ వివాదం పరిష్కారం కాకపోతే భవిష్యత్‌లో పెద్ద సినిమాల విడుదలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 'పెద్ది' విడుదలపై నైజాంలో అనిశ్చితి కొనసాగుతోంది.



## వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం

మొదటిపేజీ తరువాయి

కీలక ఆదేశాలు జారీ చేశారు.

వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉన్న మండలాలు, గ్రామాలను వెంటనే గుర్తించాలని మంత్రి సూచించారు. అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. ప్రజలు ఎండ తీవ్రతను తక్కువగా అంచనా వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన రహదారులు, అలాగే ఎక్కువగా కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎండలో పనిచేసే వారికి విశ్రాంతి, నీరు అందేలా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు.

వడగాలుల కారణంగా రాష్ట్రంలో పలు జిల్లాల్లో మరణాలు నమోదైనట్లు కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందినట్లు సమాచారం అందిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వడగాలుల కారణంగా మరణించిన ప్రతి కేసును కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఆయన



సూచించారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం అందేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఐసీయూ సదుపాయాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన చెప్పారు. గ్రామ స్థాయిలో కూడా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజలు ఎండ తీవ్రత ఉన్న సమయంలో బయటకు రావడం తగ్గించాలని, తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. తేలికపాటి దుస్తులు ధరించడం, తగినంత నీరు తాగడం, మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు తగ్గించడం వంటి సూచనలు పాటించాలని ఆయన తెలిపారు. జంతువులు, పక్షుల కోసం కూడా నీటి ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటి తొట్టెలు, మట్టి కుండలు వంటి సాధనాల ద్వారా నీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా వడగాలుల పరిస్థితిని అత్యంత సీరియస్‌గా తీసుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణ

## సర్ పేరుతో ఓట్లను తొలగిస్తే ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

చేర్చగా 93 లక్షల ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ మార్పుల ప్రభావంతోనే టీఎంసీ సుమారు 30 లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలైందని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ పరిస్థితులపై మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో ధాన్యం దిగుబడి పెరగడం వల్ల కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరిగినట్టు తెలిపారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

తన పనితీరుపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, తన పనితీరును ఏఐసీసీ లేదా ముఖ్యమంత్రి అంచనా వేస్తారని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీ అంతర్గత మార్పులు, నాయకత్వ మార్పుల విషయంలో తుది నిర్ణయం తీసుకునే అధికారం ఏఐసీసీదేనని ఆయన స్పష్టం చేశారు. ఏఐసీసీ దృష్టిలో తెలంగాణ పీసీసీ దేశంలోనే ఉత్తమ పీసీసీగా గుర్తింపు పొందిందని ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పార్టీ బలోపేతానికి తెలంగాణ యూనిట్ కృషి కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

## ఫ్యూచర్ సిటీ రద్దు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

మొదటిపేజీ తరువాయి

చేస్తూ అనిశ్చితి సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు.

ఫ్యూచర్ సిటీని కాలుష్యరహిత పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలు అక్కడ ఉండవని, ఆధునిక సాంకేతికత ఆధారిత పరిశ్రమలకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అలాంటి ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కీలక అభివృద్ధి కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆయన అన్నారు. అభివృద్ధి పట్ల నిర్మాణాత్మక సూచనలు ఇవ్వకుండా విమర్శలకే పరిమితం కావడం సరైంది కాదని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలను ప్రధాన అజెండాగా మార్చుకున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. ప్రజల అవసరాలు, రాష్ట్ర భవిష్యత్‌పై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షం రాజకీయంగా మాత్రమే వ్యవహరిస్తోందని ఆయన అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం వల్ల రాష్ట్రం నష్టపోతుందని ఆయన హెచ్చరించారు. జంట నగరాల్లో మెట్రో విస్తరణకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తే, వాటిని కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి ఆరోపించారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తున్నా, ప్రతిపక్షం రాజకీయంగా అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన అన్నారు. ఇది ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమని ఆయన వ్యాఖ్యానించారు.

పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గించేలా ప్రతిపక్ష వ్యాఖ్యలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే పలు దేశీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని, ఇలాంటి సమయంలో ప్రతికూల ప్రచారం రాష్ట్రానికి నష్టం చేస్తుందని ఆయన తెలిపారు. అభివృద్ధి, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరగాలంటే రాజకీయ స్థిరత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించాలన్న లక్ష్యం ఉందని మంత్రి వెల్లడించారు. ఆధునిక మౌలిక సదుపాయాలతో కొత్త నగర అభివృద్ధి నమూనాను రూపొందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని ఆయన చెప్పారు. పర్యావరణానికి హాని లేకుండా స్మార్ట్ సిటీ తరహాలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు.

రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు ఎవరు చేసినా ప్రజలు గమనిస్తున్నారని మంత్రి హెచ్చరించారు. అభివృద్ధి అంశాల్లో రాజకీయ లాభనష్టాలకంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన అన్నారు. ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా వ్యవహరించకపోతే అది ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతుందని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంగా ఫ్యూచర్ సిటీపై జరుగుతున్న రాజకీయ చర్చలు రాష్ట్ర అభివృద్ధి దిశను ప్రభావితం చేస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వంటి కీలక అంశాలు రాజకీయ వాదోపవాదాల్లో చిక్కుకోవడం వల్ల ప్రాజెక్టుల పురోగతిపై ప్రభావం పడే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 10 ఏళ్ల బాలిక దారుణ హత్య .. స్పందించిన సీఎం విజయ్

మొదటిపేజీ తరువాయి

చిన్నారి, అనంతరం ఓ చెరువులో మృతదేహంగా లభించడం ఆవేదనకు దారితీసింది. ఈ ఘటనపై పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. అదే సమయంలో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆరోపణలు, విమర్శలు చోటుచేసుకున్నాయి.

కోయంబత్తూర్ జిల్లా కణ్ణపాళైయం ప్రాంతానికి చెందిన 10 ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం సమీప దుకాణానికి వెళ్లిన అనంతరం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆందోళనకు గురై పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి.

శుక్రవారం ఉదయం ఓ చెరువులో బాలిక మృతదేహం లభ్యమవడంతో ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ఫోరెన్సిక్ బృందాలతో ఆధారాలు సేకరించారు. ప్రారంభ దర్యాప్తులో బాలికను ఓ వ్యక్తి బైక్‌పై తీసుకెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించినట్లు సమాచారం. ఈ ఆధారాల ఆధారంగా ఇద్దరు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

నిందితులుగా కార్తీక్, మోహన్‌రాజ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వీరి పాత్రపై లోతైన విచారణ కొనసాగుతోంది. కేసును వేగంగా ముగించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అమానవీయ ఘటనలను సమాజం ఎప్పటికీ అంగీకరించదని ఆయన వ్యాఖ్యానించారు. నిందితులను కఠినంగా శిక్షించేందుకు వేగవంతమైన దర్యాప్తు జరగాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మరోవైపు, టీవీకే ఎమ్మెల్యే ఎన్ఎం కుమార్ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై రాజకీయ దుమారం రేగింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 రోజుల్లోనే రాష్ట్రంలో నేరాలు పెరిగిపోయాయని డీఎంకే తీవ్ర విమర్శలు చేసింది. శాంతిభద్రతల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.

డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాలిక హత్యకు బాధ్యులైన వారిని వెంటనే న్యాయస్థానం ముందు నిలబెట్టి కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలు, పిల్లలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపీ నేత నారాయణన్ తిరుపతి కూడా స్పందించారు. గత ప్రభుత్వాల పాలనలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు మారినా ఇలాంటి దారుణ ఘటనలు కొనసాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కోయంబత్తూర్ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. శాంతిభద్రతలపై ప్రభుత్వ వైఫల్యం, మహిళల భద్రత అంశం, పోలీస్ వ్యవస్థ పనితీరు వంటి అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మొత్తంగా ఈ ఘటన తమిళనాట ఆవేదనను, ఆగ్రహాన్ని రేకెత్తించింది. బాలిక కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఘటనపై తీవ్ర స్పందన వ్యక్తం చేస్తున్నారు.







# లారీలు రాక జొన్న రైతుల ఆందోళన

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (డిడి9 వార్త న్యూస్ )**

బజార్హత్నూర్ మండలంలో జొన్నల మార్కెట్ సహకార సంఘంలో రైతుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. మండలంలోని రైతుల జొన్నల కాటా చేసి ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటివరకు ఒక్క లారీ కూడా మార్కెట్‌కు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అకాల వర్షాల కారణంగా మార్కెట్ యార్డులో ఉన్న జొన్న సంచులు తడుస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు బజార్హత్నూర్ సహకార సంఘాన్ని ముట్టడి చేసి నిరసన తెలిపారు. అనంతరం సీఓ నారాయణకు వినతిపత్రం అందజేసి తమ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తక్షణమే కనీసం 12 లారీలను ఏర్పాటు చేసి జొన్న సంచులను లోడింగ్ చేయించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రతి రోజూ మార్కెట్ చుట్టూ తిరగాల్సి రావడంతో వ్యవసాయ పనులు కూడా నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



# ఎడపల్లి గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలపై నిషేధం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 23(డీడీ9 వార్త) :**

ఎడపల్లి గ్రామ పరిధిలో 18 ఏళ్ల లోపు పిల్లలకు సిగరెట్లు, గుట్కా, మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ కందగట్ల రాంచందర్ హెచ్చరించారు. శనివారం గ్రామంలోని కిరాణా, వైన్ షాపులు, సూపర్ మార్కెట్లు, పాన్ షాపుల యజమానులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో గంజాయి విక్రయాలు, వాడకాన్ని పూర్తిగా నిషేధించామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయించడం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 10 గంటలకల్లా వ్యాపార సముదాయాలన్నింటినీ మూసివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ పోల మాల్కారెడ్డి, స్థానిక ఏఎస్ఐ చందర్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు కామప్ప, మల్కన్న, జహీర్, బాబా, శ్రీనివాస్, గంగాధర్, సంతోష్, సాయిరెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

# ఇందూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు పీహెచ్‌డీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 23(డీడీ9 వార్త) :**



బోధన్ పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.అప్పలనాయుడు 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' (పీహెచ్‌డీ) పట్టా అందుకున్నారు. రాజస్థాన్ పిలానీలోని శ్రీధర్ విశ్వవిద్యాలయం నుంచి 'సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులలో వ్యక్తిత్వానికి అనుసంధానంగా బోధనా సామర్థ్యం' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గానూ శనివారం ఈ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. డాక్టర్ నవీన్ కుమార్ పర్యవేక్షణలో నాలుగేళ్ల పాటు సాగిన ఈ పరిశోధన కోసం తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 2,400 మంది ఉపాధ్యాయుల వివరాలను సేకరించినట్లు అప్పలనాయుడు తెలిపారు. గత 26 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలందిస్తున్న ఆయన పీహెచ్‌డీ సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 162 మందిపై కేసులు

- **రూ.16 లక్షల జరిమానా**

**నిజామాబాద్ జిల్లా, మే 23(డీడీ9 వార్త) :**




నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన వారంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 162 మంది పట్టుబడినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో వీరిని హాజరుపరచగా ఇద్దరికి వారం రోజుల జైలు శిక్ష, మిగిలిన వారికి కలిపి రూ.16 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగినప్పుడు ఇన్సూరెన్స్ లభించదని, పట్టుబడిన వారి లైసెన్స్‌ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తామని సీపీ హెచ్చరించారు. మైనర్లు తాగి వాహనాలు నడిపితే వారిపై, వాహన యజమానులపై కూడా చార్జ్‌షీట్ నమోదు చేసి జైలు శిక్ష విధిస్తామన్నారు. మోటార్ వాహనాల సవరణ చట్టం ప్రకారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మొదటిసారి దొరికితే రూ.10 వేలు, రెండోసారి దొరికితే రూ.15 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, వాహనదారులు పత్రాలన్నీ సక్రమంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.





# ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 23(డీడీ9 వార్త)**

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతోనే పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పని చేస్తుందని ఆయన అభివర్ణించారు. శనివారం బోధన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో 'మన ఊరు మన భద్రత మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ప్రజల భద్రత కోసం పట్టణంలో విస్తృతంగా కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పట్టణంలో జరిగే ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలనైనా ఈ కెమెరాల ద్వారా సులభంగా గుర్తించి, తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నేరాల అదుపుతో పాటు ట్రాఫిక్ నియంత్రణలోనూ ఈ సాంకేతికత పోలీసులకు ఎంతగానో సహాయపడుతుందని వివరించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రతి వార్డు కౌన్సిలర్ తమ వార్డు పరిధిలో భద్రతను బాధ్యతగా తీసుకుని, కనీసం ఐదేసి కెమెరాల చొప్పున ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపార సంస్థలు, ముఖ్యంగా బంగారం దుకాణాల యజమానులు తమ పరిసరాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఆదేశించారు. బోధన్ టౌన్‌లో 32 కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ శాఖకు అండగా నిలిచిన బంగారం దుకాణాల సంఘం అధ్యక్షుడు కదమ్ ప్రమోద్‌ను ఈ సందర్భంగా సీపీ ఘనంగా సన్మానించారు. అలాగే పట్టణంలో డ్రగ్స్ నివారణ, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాల నివారణపై గోడల మీద చిత్రాలు (వాల్ పెయింటింగ్స్) వేస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తున్న సమీర్ అనే యువకుడిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎన్. శుభం ప్రకాష్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్హెచ్ఓ వెంకట నారాయణ, రుద్రూర్ సీఐ కృష్ణ, రూరల్ ఎస్ఐ మచ్చేందేర్, బోధన్ ఎస్ఐ మనోజ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇలియాస్, స్థానిక కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.




# నిధులు తేలేని కాంగ్రెస్ ప్రతినిధులు రాజీనామా చేయాలి

- **ఎమ్మెల్యే ధన్‌పాల్**

**నిజామాబాద్ జిల్లా, మే 23(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ నగర అభివృద్ధికి నిధులు తీసుకురాలేని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లయినా జిల్లా కేంద్రానికి ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ల జోడీ కేవలం సొంత ప్రయోజనాల కోసమే తప్ప, జిల్లా అభివృద్ధికి కాదని ఆరోపించారు. ఖమ్మం, కరీంనగర్, వరంగల్ నగరాలకు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మంజూరు చేసి, నిజామాబాద్‌పై చిన్నచూపు చూడటం ఏంటని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ముందు స్వయంగా సీఎం వచ్చి ఓఆర్ఆర్ ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఆయా నగరాల అభివృద్ధికి రూ.5,620 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. నిజామాబాద్‌ను మాత్రం పూర్తిగా పక్కనబెట్టిందని మండిపడ్డారు. నగరంలో 30 ఏళ్లుగా మాస్టర్ ప్లాన్ అటకెక్కిందని, స్టేడియం, కళాభారతి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు బిల్లులు రాక అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తున్నా రాష్ట్రం వాటా ఇవ్వడం లేదని, వచ్చే వారంలో సీఎంను కలిసి నిధుల విషయమై నిలదీస్తామని, స్పందించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు స్రవంతి రెడ్డి, ఎన్.లక్ష్మీనారాయణ, పి.లక్ష్మీనారాయణ, ప్రమోద్, సునీత, పవన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సాటాపూర్ పశువుల అంగడిను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ సాయి చైతన్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 23(డీడీ9 వార్త) :**

రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా అప్రమత్తంగా ఉందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. శనివారం ఆయన రెంజల్ మండల పరిధిలోని సాటాపూర్ పశువుల సంతను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సంతలో జరుగుతున్న పశువుల క్రయవిక్రయాల వివరాలను గ్రామ పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర పరిధిలో ఏర్పాటు చేసిన వెటర్నరీ వైద్యుల చెకింగ్ పాయింట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పశువుల రవాణా వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. వెటర్నరీ అధికారులు జారీ చేస్తున్న ఆరోగ్య ధృవపత్రాల పరిశీలన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పండుగ నేపథ్యంలో తరలిస్తున్న జంతువుల ఆరోగ్య ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయో లేదో వెటర్నరీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి జంతువుకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య ధృవపత్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. అక్రమ రవాణా, అనారోగ్యంతో ఉన్న పశువుల విక్రయాలు, చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెకింగ్ పాయింట్ల వద్ద పోలీసులు, వెటర్నరీ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పండుగ వేడుకలను ప్రజలందరూ ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని కమిషనర్ పేర్కొన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గమనించిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్, పశుసంవర్ధక శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్ రెడ్డి, మండల వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ విట్టల్, వైద్యులు ప్రమోద్ ఎడపల్లి, నరేందర్ నవీపేట్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

- **పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు జడ్జి కుంభ సందీప్**

**ఆదిలాబాద్ జిల్లా బోథ్ బ్యూరో మే 23 : (డిడి 9 వార్త )**

సోనాల మండలం మారుమూల గ్రామాలైన కేశవ్ గూడా, సంపత్ నాయక్ తండాలలో తెలంగాణ హైకోర్టు వారి ఆదేశాలనుశారం మొబైల్ లోక్ అదాలత్ అవగాహన సదస్సును బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జడ్జి కుంభ సందీప్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు తక్షణమార్గం లోక్ అదాళతే అని,ఖర్చు లేకుండా సమస్యలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.పల్లెలలో చట్టాలపై తమ హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు.ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండి బాధ్యత తో నడుచుకోవాలని తెలిపారు. యువత గంజాయి,గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరదని సూచించారు.పల్లెలు దేశానికి పట్టుకోమ్మలని చెప్పారు. యువత చెడు అలవాట్లకు లోనయి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. పల్లెల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు సిర్పూర్ మహేష్ ,సందేశ్, చౌహాన్ అర్జున్ సింగ్, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్ సంపత్ నాయక్ తండ మాజీ సర్పంచ్ సాకారం, గ్రామస్థులు విలాస్,ఇందాల్ సింగ్, ప్రతాప్ సింగ్ కేశవగూడ గ్రామస్థులు జైతు పటేల్ , జాకేష్ , శంభు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.




# బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకు ఘన సన్మానం..

- **ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తాం....**

**ఆదిలాబాద్ బోథ్ బ్యూరో మే 23 (డిడి 9 వార్త )**



నూతనంగా ఎన్నికైన బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు మునేశ్వర్ సోమన్న, జుంగల భోజన్న లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా .ఏఐసీసీ రాష్ట్ర విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, డిసిసి జిల్లా కార్యదర్శి లోలపు .పోశెట్టి* లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో ప్రతి కార్యకర్త కు గుర్తింపు వస్తుందని, పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి లోలపు. పోశెట్టి, సోనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, సర్పంచ్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు బాశెట్టి .సుదర్శన్, రామాయి. రవీందర్ , భీంరావు పాటిల్, విజయ్ భాస్కర్, మాధవరావు, నరేందర్, భోజరాజు, జ్ఞానేశ్వర్, మారుతి, అంకుష్, చెట్లపేల్లి సుధీర్, సంతోష్, సత్యనారాయణ,తదితరు పాల్గొన్నారు..



## ప్రమాదవశాత్తు దగ్ధమైన జొన్న పంట

**డిడి9 వార్త గుడిహత్నూర్**

మండలం తోషం తండాలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానిక రైతు జాదవ్ రవిరాజ్‌కు చెందిన ఆరు ఎకరాల్లో సాగు చేసిన జొన్న పంట ప్రమాదవశాత్తు మంటల్లో దగ్ధమైంది. ఇప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న పంట పూర్తిగా కాలిపోవడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది.
అంతేకాకుండా సంచుల్లో నిల్వ ఉంచిన జొన్న ధాన్యం కూడా మంటలకు ఆహుతైంది. పొలంలో ఉన్న పైపులైన్ మోటార్ కాలి బూడిదయ్యాయి సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ జితేందర్ వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక గ్రామస్తులు కలిసి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో రైతు కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ SC సెల్ ఉపాధ్యక్షుడికి సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా బోథ్ బ్యూరో మే 23 : (డిడి 9 వార్త )**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం దిశగా అడుగులు వేస్తూ రాష్ట్రం లోని అన్ని కమిటీలు వేస్తున్న సందర్భంగా నిన్న ప్రకటించిన రాష్ట్ర SC సేల్ రాష్ట్ర కమిటీ లో మా చిన్ననాటి మిత్రుడు కుర్మే మహేందర్ ను తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ SC సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించిన శుభసాందర్భంగా మిత్రులు మేరుగు భోజన్న,బారే నాగేందర్,అప్పాల శ్రీనివాస్ రెడ్డి,సిరిపురం చందు,బీరం చంద్రమోహన్,లాడి గిరీష్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది



## మహిళాభిమానికి క్షమాపణ చెప్పిన రోహిత్ శర్మ.. కారణమిదే!

- **తాను కలవలేదని ఏడ్చిన యువతి వీడియో వైరల్**
- **ఆమెకు సారీ చెబుతూ వీడియో సందేశం పంపిన హిట్ మ్యాన్**
- **వచ్చేసారి కోల్‌కతా వస్తే తప్పకుండా కలుస్తానని హామీ**
- **రోహిత్ స్పందనతో యువతి ఆనందం**

**డిడి9 వార్త:**

టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ తన మంచి మనసును మరోసారి చాటుకున్నాడు. తనను కలవలేకపోయానని ఓ యువతి కన్నీళ్లు పెట్టుకున్న వీడియో చూసి చలించిపోయాడు. ఆమెకు క్షమాపణ చెబుతూ ప్రత్యేకంగా ఓ వీడియో సందేశాన్ని పంపించాడు. వచ్చేసారి కోల్‌కతా వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని హామీ ఇచ్చి ఆమెను ఆనందంలో ముంచెత్తాడు.

**అసలేం జరిగిందంటే..!**
ఇటీవల కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి ఇండియన్స్, కేకేఆర్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కోసం వచ్చిన రోహిత్‌ను చూసేందుకు జినియా అనే యువతి స్టేడియానికి వచ్చింది. తన అభిమాన క్రికెటర్‌ను కలవడం తన కల అని, గంటల తరబడి ఎదురుచూసింది. డ్రెస్సింగ్ రూమ్ నుంచి ఆటగాళ్లు బయటకు వస్తున్నప్పుడు, రోహిత్‌ను చూసి 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే, అక్కడి అభిమానుల శబ్దంలో ఆమె పిలుపును రోహిత్ గమనించకుండా వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర నిరాశకు గురైన ఆ యువతి కన్నీరు పెట్టుకుంది. ఈ దృశ్యాన్ని ఆమె బంధువు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, అది కాస్తా వైరల్ అయింది.
ఈ వీడియో రోహిత్ శర్మ దృష్టికి చేరింది. అభిమాని బాధను చూసి హిట్ మ్యాన్ స్పందించాడు. "హాయ్ జినియా! నిన్ను ఈడెన్ గార్డెన్స్‌లో కలవలేకపోయినందుకు క్షమించు. నీ వీడియో చూశాక నాకూ బాధేసింది. కొన్నిసార్లు అభిమానుల రద్దీలో ఎవరు పిలుస్తున్నారో గుర్తించడం కష్టమవుతుంది. వచ్చేసారి కోల్‌కతా వచ్చినప్పుడు నిన్ను తప్పకుండా కలుస్తాను" అని చెబుతూ ఓ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియో చూసిన జినియా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



# శ్రేయస్ సంచలన బ్యాటింగ్... పంజాబ్ గెలిచింది, రేసులో నిలిచింది!

- **కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అజేయ సెంచరీతో పంజాబ్ ఘన విజయం**
- **ప్లేఆఫ్స్ రేసులో తమ ఆశలను సజీవంగా నిలుపుకున్న పంజాబ్ కింగ్స్**
- **ప్రభ్‌సిమ్రాన్‌తో కలిసి అయ్యర్ 140 పరుగుల కీలక భాగస్వామ్యం**
- **ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పరిమితమైన లక్నో**
- **సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి, శతకాన్ని పూర్తి చేసుకున్న శ్రేయాస్**

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తమ ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్సర్లు) వీరోచిత సెంచరీతో ముందుండి నడిపించాడు. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. 197 పరుగుల టార్గెట్ ను మరో రెండు ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. 18 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసి విజయభేరి మోగించింది. అయ్యర్ తన తొలి ఐపీఎల్ సెంచరీని నమోదు చేయడంతో పాటు, జట్టుకు మరపురాని విజయాన్ని అందించాడు. ఈ ఓటమితో లక్నో ఈ సీజన్‌లో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలవడం ఖాయమైంది.
197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే ప్రియాన్ష్ ఆర్య (0) ఔట్ కాగా, కాసేపటికే కూపర్ కనోలీ (18) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో పంజాబ్ 22 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పారు.
విజయం దిశగా సాగుతున్న దశలో ప్రభ్‌సిమ్రాన్ ఔటయ్యాడు. అప్పటికి పంజాబ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా, శ్రేయస్ అయ్యర్ పూర్తి బాధ్యత తీసుకున్నాడు. గేర్లు మార్చి దూకుడుగా ఆడిన అతను, మహ్మద్ షమీ వేసిన ఓవర్లో మూడు సిక్సర్లు బాది మ్యాచ్‌ను లాగేశాడు. చివరికి మరో భారీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించడమే కాకుండా, తన కెరీర్‌లో తొలి ఐపీఎల్ సెంచరీని స్టైల్‌గా పూర్తి చేసుకున్నాడు. ఒత్తిడిలో ఒక కెప్టెన్‌గా అతను ఆడిన తీరు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది.




అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. జాష్ ఇంగ్లిస్ (72), ఆయుష్ బదోని (43) రాణించడంతో లక్నో పోరాడగలిగే స్కోరును సాధించింది. అయితే, కేవలం ఐదుగురు రెగ్యులర్ బౌలర్లతో బరిలోకి దిగిన లక్నో, బౌలింగ్‌లో వైఫల్యం చెంది ఈ స్కోరును కాపాడుకోలేకపోయింది. కీలక సమయంలో వికెట్లు తీయలేకపోవడం, అయ్యర్ దూకుడును అడ్డుకోలేకపోవడం లక్నో ఓటమికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# హెడ్‌కు షేక్ హ్యాండ్ ఇవ్వని కోహ్లీ.. మైదానంలో మాటల యుద్ధం.. ఆ తర్వాత అవమానం!

- **ఆర్‌సీబీ, ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో కోహ్లీ, హెడ్ మధ్య వాగ్వాదం**
- **మ్యాచ్ అనంతరం హెడ్ ఇచ్చిన షేక్ హ్యాండ్‌ను పట్టించుకోని కోహ్లీ**
- **ఉద్దేశపూర్వకంగా హెడ్‌ను దాటి ముందుకెళ్లిన విరాట్**
- **మ్యాచ్ ఓడినా సన్‌రైజర్స్‌ను వెనక్కినెట్టి టేబుల్ టాపర్‌గా నిలిచిన ఆర్‌సీబీ**

**డిడి9 వార్త:**

శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఎస్ఆర్‌హెచ్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ కరచాలనం చేసేందుకు ప్రయత్నించగా, ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అతడిని చూసీచూడనట్టు ముందుకు వెళ్లిపోయాడు. వీరిద్దరి మధ్య మ్యాచ్ సమయంలో జరిగిన వాగ్వాదమే ఇందుకు కారణమని తెలుస్తోంది.
హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 256 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదిస్తున్న సమయంలో ఈ వివాదం మొదలైంది. కోహ్లీ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు హెడ్‌తో వాగ్వాదానికి దిగాడు. కోహ్లీ సీరియస్‌గా మాట్లాడుతుండగా, హెడ్ మాత్రం నవ్వుతూ కనిపించాడు. వీరి మధ్య మాటల యుద్ధం ఎందుకు మొదలైందో స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే కోహ్లీ 11 పరుగులకే ఔటయ్యాడు. అనంతరం ఆర్‌సీబీ 55 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.



అయితే, ఈ ఓటమి తర్వాత కూడా ఆర్‌సీబీ పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్‌ను వెనక్కి నెట్టి ఐపీఎల్ 2026 లీగ్ దశలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మ్యాచ్ అనంతరం ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు అభినందించుకుంటూ లైన్‌లో వస్తుండగా, హెడ్ కరచాలనం కోసం చేయి అందించాడు. అయితే, కోహ్లీ అతడికి ముందున్న ఆటగాడితో, తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్‌తో షేక్ హ్యాండ్ ఇచ్చి, హెడ్‌ను మాత్రం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోకుండా దాటి వెళ్లాడు. దీంతో హెడ్ ఆశ్చర్యంగా కోహ్లీ వైపు చూస్తూ ఉండిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కృనాల్ వింత బౌలింగ్‌కు కావ్య మారన్ షాక్.. స్టాండ్స్‌లో ఆమె రియాక్షన్ వైరల్!

- **ఎస్ఆర్‌హెచ్‌పై కృనాల్ పాండ్యా వినూత్న బౌలింగ్**
- **అతని బౌలింగ్ యాక్షన్‌తో అయోమయంలో కావ్య మారన్**
- **ఇలాంటి బౌలింగ్‌కు అనుమతి ఉందా? అని ఆశ్చర్యం**

**డిడి9 వార్త:**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యా తన వినూత్న బౌలింగ్‌తో ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నాడు. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అతని బౌలింగ్ శైలి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ యాక్షన్‌ను చూసిన ఎస్ఆర్‌హెచ్ యజమాని కావ్య మారన్ సైతం అయోమయానికి గురయ్యారు.
ఐపీఎల్‌లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో కృనాల్ పాండ్యా తన సైడ్‌ఆర్మ్ యాక్షన్‌తో పాటు బ్యాటర్లపై బౌన్సర్లను కూడా అస్త్రంగా ప్రయోగించాడు. ఇది చూసిన కావ్య మారన్, అసలు ఇలాంటి బౌలింగ్‌కు అనుమతి ఉందా? అన్నట్లుగా హావభావాలు ప్రదర్శించారు. స్టాండ్స్‌లో కూర్చున్న ఆమె ముఖ కవళికలు కెమెరాలో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. దీంతో ఆమె రియాక్షన్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆ సమయంలో ఆమె పక్కన టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేశ్ ఉన్నారు.
అయితే, కావ్య మారన్‌ను అంతగా ఆశ్చర్యపరిచిన కృనాల్ బౌలింగ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. తాను వేసిన రెండు ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి కేవలం ఒక వికెట్ మాత్రమే తీశాడు. అనంతరం బ్యాటింగ్‌లో 31 బంతుల్లో



41 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు. అయినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 55 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. కృనాల్ ప్రదర్శన జట్టును గెలిపించలేకపోయింది.

డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరు కూడా ఆన్‌లైన్‌కే అలవాటు పడుతున్నారు. అందరూ ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడం అనేది సాధారణంగా మారిపోయింది. అయితే ఆన్‌లైన్‌లో షాపింగ్‌లు చేస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ఇబ్బందులు తలెత్త అవకాశం ఉందని టెక్ నిపుణులు సూచిస్తున్నారు. ఇక ప్రముఖ ఆన్‌లైన్ దిగ్గజాలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి కంపెనీలు వినియోగదారుల కోసం కొత్త కొత్త ఆఫర్లను ప్రకటిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువు కొనాలనుకుంటే కొన్ని టిప్స్ పాటిస్తే ఎంతో మంచిది. మీరు ఏవైనా వస్తువులు కొనాలనుకుంటే సేల్ కన్నా ముందే వాటిని సెలెక్ట్ చేసి పెట్టుకోవాలి. సేల్ కన్నా ముందు వాటి ధరలు ఎంత ఉన్నాయో, సేల్ సమయంలో ఎంత ఉన్నాయో ట్రాక్ చేయడం మర్చిపోవద్దు. కొన్ని వస్తువుల ధరలు సేల్ సమయంలో కూడా తగ్గవు. అలాంటప్పుడు మీరు సేల్ వరకు ఎదురు చూడటం వృథా అనే చెప్పాలి.

# ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారా.. అయితే ఇవి గుర్తుంచుకోండి

**డిస్కౌంట్ యాడ్స్‌ను చూసి నమ్మొద్దు :**
మీరు నేరుగా సేల్ సమయంలోనే మీకు కావాల్సిన ప్రొడక్ట్ సెర్చ్ చేస్తే అప్పుడు ధర తగ్గిందా లేదా అన్న విషయం తెలియదు. అందుకే ముందు నుంచే ట్రాక్ చేయడం బెటర్. ఇకామర్స్ సైట్‌లో కనిపించే డిస్కౌంట్లను పూర్తిగా నమ్మకూడదు. 50 శాతం, 60 శాతం, ఒక్కోసారి 90 శాతం డిస్కౌంట్ అని యాడ్స్ కనిపిస్తాయి. స్క్రీన్‌లపై కనిపిస్తున్న డిస్కౌంట్స్ చూసి మోసపోకూడదు. మీరు కొనాలనుకునే వస్తువు ధర ఎంత ఉంటుందో మీకు ఓ ఐడియా ఉండాలి. అంతకన్నా తక్కువకే ఆ వస్తువు లభిస్తే కొనాలి. అంతే తప్ప డిస్కౌంట్స్ చూడకూడదు. మీరు ధరలను చాలాకాలంగా ట్రాక్ చేస్తూ ఉంటే సేల్ సమయంలో ఆ వస్తువు ధర తక్కువ ఉందో ఎక్కువ ఉందో తెలుస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో వస్తువుల ధరలను ట్రాక్ చేసేందుకు వెబ్‌సైట్స్, యాప్స్ ఉంటాయి. వాటిని ఉపయోగించుకోవచ్చు. మీరు కొనాలనుకునే వస్తువులను విష్ లిస్ట్‌లో పెట్టుకోవాలి. ఆ ప్రొడక్ట్‌స్‌కి సంబంధించి ఆఫర్స్ ఉంటే మీకు నోటిఫికేషన్స్ వస్తాయి. మీరు కొనే వస్తువులకు బ్యాంక్ ఆఫర్స్ ఉన్నాయో లేదో చెక్ చేయాలి.
కొన్ని ప్రొడక్ట్స్ ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే లభిస్తాయి. మరికొన్ని ప్రోడక్ట్స్ అమెజాన్‌లో లభిస్తాయి. కానీ చాలావరకు ప్రొడక్ట్స్ రెండు వెబ్‌సైట్లలో లభిస్తాయి. ధర ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ కొనాలి. ఉదాహరణకు .. మీరు వాషింగ్ మెషీన్ కొనాలనుకుంటే పెద్దపెద్ద బ్రాండ్స్ ఆన్‌లైన్‌లో అమ్ముతుంటాయి. బ్రాండ్స్ వేర్వేరు అయినా ఫీచర్స్ ఒకేలా ఉంటాయి. ఆన్‌లైన్ షాపింగ్ ఓ వ్యసనం లాంటిదన్న విషయం గుర్తుంచుకోవాలి. ఈ వ్యసనంలో పడి అవసరం లేని వస్తువులు కూడా కొనుగోలు చేయకూడదు. అవసరం లేని వస్తువులు కొంటూ పోతే జీవితంలో ఏదో ఓ దశలో అవసరం ఉన్న వస్తువుల్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్న విషయం గుర్తించుకోవాలి.




**నకిలీ వెబ్‌సైట్లపై నిఘా పెట్టండి :**
ఈ మధ్య కాలంలో నకిలీ వెబ్‌సైట్లు చాలా పుట్టుకొస్తున్నాయి. నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి వివిధ ఆఫర్ల అంటూ కస్టమర్లను నమ్మించి మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఒక ప్రొడక్ట్‌స్‌ను చూపించి డెలివరి చేసే సమయంలో నాణ్యత లేకుండా నకిలీ వస్తువులను డెలివరి చేసిన సందర్భాలు కూడా ఉంటున్నాయి. అందుకే ఏదైనా వస్తువులను ఆర్డర్ చేస్తే ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తదితర మంచి పేరున్న సైట్ల నుంచి ఆర్డర్ చేస్తే మంచిది. అలాంటి వారు వస్తువుల్లో ఏదైనా పొరపాటు జరిగితే రిటన్ తీసుకుని క్యాష్‌బ్యాక్‌ను అందిస్తారు. లేదా నాణ్యతమైన వస్తువులను అందిస్తారు.

**వెబ్‌సైట్ కంపెనీ :**
ఆకర్షణీయమైన బట్టలు లేదా ఇతర ప్రొడక్ట్స్ ఫోటోలు చూపిస్తూ సోషల్ మీడియాలో అనేక ప్రకటనలు కనిపిస్తూ ఉంటాయి. అయితే అలాంటి వెబ్‌సైట్ యొక్క రిజిస్టర్ కార్యాలయం చిరునామా, ల్యాండ్‌లైన్ నెంబర్, ఇతర సమాచారాన్ని తనిఖీ చేయడం ముఖ్యం. ఏ కంపెనీ వెబ్ సైట్‌లోనైనా వారి పూర్తి సమాచారం కనిపించకపోతే అలాంటి సైట్ నుంచి షాపింగ్ చేయవద్దు.

**క్యాష్ అన్ డెలివరీ :**
ఇటీవల అనేక కొత్త కొత్త కంపెనీలు వివిధ పేర్లతో ఆన్‌లైన్ షాపింగ్‌లోకి దిగుతున్నాయి. ఇంటర్‌నెట్ ఆకర్షనీయమైన ఆపర్లతో ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అయితే అలాంటి వాటిని నమ్మడం అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాక.. ఆయా కంపెనీలు డెలివరీ చేయకుండా మోసం చేసే ప్రమాదం కూడా ఉంది. అందుకే కొత్త సైట్‌ల నుంచి ఏదైనా ఆర్డర్ చేస్తే క్యాష్ అండ్ డెలివరి ఆప్షన్ ఎంచుకుంటే మంచిది. ఒక వేళ వారు ఈ ఆప్షన్ ఇవ్వకపోతే అలాంటి సైట్ల జోలికి వెళ్లకపోవడం మంచిది.

**వస్తువుల్లో నాణ్యత - వారంటీ :**
డిస్కౌంట్లను చూసి అనేక మంది నాణ్యత లేని వస్తువులను కొనుగోలు చేసి మోసపోతుంటారు. దీంతో ఏదైనా వస్తువులను కొనే ముందు దాని రివ్యూలు, రేటింగ్‌లు చూడటం, దాని గురించి ఆన్‌లైన్‌లో వెతకడం మంచిది. తక్కువ ధర ఉంది కదా అని కొనుగోలు చేస్తే నాణ్యత లేకుండా ఉంటాయి. అలాగే ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో ఏసీ, టీవీ, ఫ్రిజ్, మైక్రోవేవ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు తప్పనిసరిగా వారంటీని చూడాలి. మంచి నాణ్యతతో ఎక్కువ కాలం వారంటీ అందించే వస్తువులనే కొనుగోలు చేయడం ఉత్తమం



# ఐడియా అదుర్స్ కదూ

**మీరు చేస్తోన్న ఉద్యోగంతో విసిగిపోయారా.? చాలీచాలనంత జీతం మీ నిత్యావసరాలకు ఏమాత్రం సరిపోవట్లేదా.? ఏదైనా వ్యాపారం చేసే ఆలోచన ఉందా.? సాధారణంగా ఏ వ్యాపారమైన మొదలుపెట్టే ముందు.. అందులో రిస్క్ ఎంత ఉంటుంది.? పెట్టుబడి పెడితే.. వచ్చే లాభం ఎంత.? ఇలా ప్రశ్నలు ఎన్నో ఉంటాయి. అలాంటి వారి కోసం అదిరిపోయే బిజినెస్ ఐడియాలు ఇవి. పెద్ద రిస్క్ లేకుండా.. కేవలం రూ. 50 వేల పెట్టుబడితో ఈ వ్యాపారాలు మొదలుపెట్టొచ్చు. దీంతో నెలనెలా రూ. లక్షల్లో ఆదాయం మీ సొంతమవుతుంది.**

**వస్త్రాల వ్యాపారం:**
పెళ్లిళ్లు, పండుగలు, పుట్టినరోజు.. ఇలా ఒకటేమిటి మనకు స్పెషల్ డే ఏదైనా కూడా కొత్త బట్టలు వేసుకోకుండా ఆ రోజు గడవదు. దేశంలో ఏ ప్రాంతమైనా.. బట్టలకు డిమాండ్ విపరీతంగానే ఉంటుంది. కాబట్టి మీరు కూడా ఈ వ్యాపారాన్ని కేవలం రూ. 50 వేల పెట్టుబడితో ప్రారంభించి.. మాంచి లాభాలు ఆర్జించవచ్చు.

**స్ట్రీట్ ఫుడ్ స్టాల్ లేదా ఫుడ్ ట్రక్ :**
ఫుడ్ బిజినెస్.. దేశంలో ఎలాంటి రిస్క్ లేకుండా బెస్ట్ బిజినెస్ ఆప్షన్ ఇది అని చెప్పొచ్చు. మీరు కూడా రూ. 50 వేల పెట్టుబడితో ఏదైనా వ్యాపారాన్ని మొదలు పెడితే.. వెంటనే ఫుడ్ స్టాల్ లేదా ఫుడ్ ట్రక్‌ని ప్రారంభించండి. దీనికి ముడిసరుకుతోనే పని ఉంటుంది. కాబట్టి వాటికీ అయ్యేది తక్కువ ఖర్చే. ఇక క్వాలిటీ, క్వాంటిటీ మాంచిగా ఉంటే.. మీ ఫుడ్ బిజినెస్ అద్భుతమే. నూడుల్స్, మోమోస్, చాట్‌పకోడీ లేదా ఇతర స్ట్రీట్ ఫుడ్ వంటి వాటిని మీరు అమ్మవచ్చు. ఫుడ్ ట్రక్కులలో కూడా మీరు స్ట్రీట్ ఫుడ్స్, టిఫిన్స్ లాంటివి ఉదయం, సాయంత్రం సమయాల్లో అమ్మకం పెట్టుకోవచ్చు.

**ట్యూషన్ లేదా ఆన్‌లైన్ క్లాసులు :**
మీరు చదివిన, అలాగే మీ జ్ఞానాన్ని మరికొంతమందికి పంచితే.. తప్పేమి కాదు. ఇప్పుడు టీచర్స్‌గా చేస్తున్న ప్రతీ ఒక్కరు.. సాయంత్రం వేళల్లో పిల్లలకు ట్యూషన్లు చెబుతున్నారు. మరి మీరు కూడా ఏ సబ్జెక్ట్‌లో పరిజ్ఞానాన్ని కలిగి ఉంటే.. మీ ఇంటి దగ్గరే స్థానికంగా టెన్త్ అంతకన్నా తక్కువ తరగతులు చదువుతున్న పిల్లలకు.. అలాగే ఇంటర్ చదివేవాళ్లకు ట్యూషన్ చెప్పొచ్చు. లేదా యూట్యూబ్ ద్వారా సొంతంగా చానెల్ ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్ క్లాసులు కూడా బోధించవచ్చు.

**వెడ్డింగ్ ప్లానర్ :**
అతి తక్కువ పెట్టుబడితో ఇదొక విజయవంతమైన వ్యాపారం. మీరు మీ కస్టమర్ అవసరాలకు అనుగుణంగా అత్యంత సృజనాత్మకంగా వివాహాలు, ఈవెంట్‌లను నిర్వహిస్తే.. ఈ వ్యాపారంలో మాంచి లాభాలు ఆర్జించినట్టే. దీన్ని ప్రారంభించడానికి కొంత డబ్బు అవసరం పడుతుంది. కానీ ఆ తర్వాత వ్యాపారం లాభాల బాట పడితే.. రాబడి చాలా బాగుంటుంది. వెడ్డింగ్ ప్లానింగ్ లేదా ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో అనేక డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఉదాహరణకు క్యాటరింగ్, ఫోటోగ్రఫీ, డెకరేషన్ ఇలా ఏదొక దానిపై మీరు డబ్బు సంపాదించవచ్చు.

**ఊరగాయ వ్యాపారం :**
తక్కువ పెట్టుబడితో మరో మంచి వ్యాపార ఆలోచన ఊరగాయ వ్యాపారం. భోజనం సమయంలో ఊరగాయ లేకుండా చాలామందికి ముద్దదిగదు. దాదాపు ప్రతి ఇంట్లో కనీసం ఒక రకమైన ఊరగాయ ఉంటుంది. అందువల్ల, మీరు చిన్న వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంటే, ఊరగాయ వ్యాపారం రిస్క్ లేని బిజినెస్. భారతీయ మార్కెట్లలో ఏడాది పొడవునా పచ్చళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎవరైనా చాలా సులభంగా ఈ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు.



# కొబ్బరిచిప్పలో చాయ్.. ఓసారి ట్రై చెయ్

భోజనంను ప్లేట్లలో కాకుండా అరటి ఆకుల్లో, ఇస్తారి ఆకులో తినడం వల్ల ఆరోగ్యకరం అని మనందరికీ తెలుసు. సాధారణ లోహ పాత్రల్లో వండిన భోజనం కంటే మట్టికుండలో వండిన భోజనం రుచిగా ఉంటుందని చెప్తారు. అలాగే బొంగులో చికెన్, దొన్నెలో బిర్యానీ, మురికి అన్నం, జంబలకిడి జారు మిఠాయి వంటివి కొన్ని రోజుల పాటు ఇంటర్నెట్లో ట్రెండ్ అయ్యాయి, ఇందులో కొన్ని ఇప్పటికీ ప్రజాదరణ కలిగి ఉన్నాయి. ఇప్పుడు కొబ్బరిచిప్పలో చాయ్ అనేది నెట్టింట్లో ఉడుకుతోంది.
మీరు కొబ్బరిచిప్పలో కొబ్బరి తినేసి చిప్పను పాడేస్తున్నట్లయితే ఇక నుంచి అలా చేయకండి, వాటిని భద్రంగా దాచుకోండి. ఎందుకంటే అందులోనే టీ కాచుకోవచ్చు. కొబ్బరిచిప్పల్లో వండిన అన్నం, కూరలు, పాయసం ఇలా ఏది వండినా కూడా రుచికరంగా ఉంటుందట. కొబ్బరిచిప్పలో పీచుపదార్థంతో పాటుగా విటమిన్లు ఏ, బీ, ఈ, కే లు ఉంటాయి. ఇందులో ఆహారపానీయాలను ఉడికించుకొని తింటే అదనంగా ఈ పోషకాలు కూడా శరీరానికి అందుతాయి, ఇవి మీ ప్రేగు కదలికలను మెరుగుపరుస్తాయి, జీర్ణవ్యవస్థకు మంచిది. అంతేకాకుండా ఇవి పర్యావరణ హితమైనవి అని అంటున్నారు. ఇప్పుడు కొబ్బరిచిప్పలో టీ చేసుకొనే ట్రెండ్ మళ్లీ మొదలైంది.



**ఎలా చేసుకోవాలంటే..?**

1 కొబ్బరి చిప్ప
1/4 టీస్పూన్ టీ పొడర్
1/2 టీస్పూన్ చక్కెర
1-2 ఏలకులు
1/2 కప్ప పాలు, అవసరమైనన్ని నీళ్లు

కొబ్బరిచిప్పలో టీ తయారుచేసే విధానం...
ముందుగా రంధ్రాలు లేని ఒక కొబ్బరి చిప్పను తీసుకోండి. దానిని శుభ్రంగా కడగండి.
ఈ చిప్పలో పాలు, నీళ్లు పోసి తక్కువ మంట మీద వేడిచేయండి.
పాలు ఉడకటం ప్రారంభమయ్యాక టీ ఆకులు, చక్కెర, యాలకులు వేసి మరిగించండి.
పొంగకుండా కలుపుతూ ఉండండి, చాయ్ సిద్ధం అవుతుంది.
అంతే, ఇద్ది కొబ్బరిచిప్పలో టీ.. మీరు చేసుకొని తాగి చూడండి.


# ఆయన కళ్లు అంటే నాకు ఇష్టం..



టాలీవుడ్‌కు చెందిన ఆ హీరో కళ్లు, ఆయన నటన అంటే నాకు చాలా ఇష్టం అంటుంది హీరోయిన్ అవికాగోర్. 'చిన్నారి పెళ్లి కూతురు' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మడు.. 'ఉయ్యాల జంపాల' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక తన పెళ్లి తర్వాత ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన అవిక.. రీసెంట్‌గా 'అగ్లీస్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి పర్వాలేదనిపించుకుంది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. 'మీ జీవితకాలంలో ఒకే హీరోతో కేవలం మూడు సినిమాలు చేసే అవకాశం వస్తే, మీరు ఎవరిని ఎంచుకుంటారు?' అని యాంకర్ ప్రశ్నించగా.. ఆలోచించుకోకుండా నేచురల్ స్టార్ నాని పేరు చెప్పింది ఈ బ్యూటీ. 'ఆయన కళ్ళు, ఆయన భావాలను వ్యక్తపరిచే విధానం, ప్రతీదానిలో ఎంతో డెప్త్ ఉంటుంది. ఆయన నటనలో ఎన్నో కోణాలు ఉన్నట్లు అనిపిస్తుంది. నాకు అలాంటి నటన అంటే చాలా ఇష్టం. ఆ హీరోతో సినిమా చేయడానికి అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను' అని తెలిపింది.

## ఆదర్శకుటుంబంలోకి నివేద!

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాలోకి కొత్తగా మరో అందం చేరినట్లు తెలుస్తోంది. నటి నివేదా పేతురాజ్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇది త్రివిక్రమ్‌తో ఆమెకి రెండో సినిమా. తను గతంలో ఆయన దర్శకత్వంలో 'అల.. వైకుంఠపురములో' సినిమాలోనూ ముఖ్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం తుది దశ చిత్రీకరణలో ఉన్న ఈ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశముందని ప్రచారం వినిపిస్తోంది. ఇది కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోంది.



# వినాయక చవితికి జైలర్ 2!



"టైగర్ కా హుకుం".. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

# అలాంటోడిని ఎవరూ ఓడించలేరు



ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ (Puri Jagannadh) 'పూరి మ్యూజింగ్స్' (Puri Musings) పేరిట ఆసక్తికర విషయాలు పంచుకుంటున్న సంగతి తెలిసిందే. తాజా ఎపిసోడ్‌లో యాటిట్యూడ్ (Attitude) గురించి మాట్లాడారు. రైట్ యాటిట్యూడ్ ఉన్నోడిని ఎవరూ ఓడించలేరంటూ స్ఫూర్తినింపే ప్రయత్నం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే?

"నీ యాటిట్యూడ్ వల్ల నీ చుట్టూ ఉన్న ప్రపంచం మారిపోదు. కానీ, నీలోని ప్రపంచం మారుతుంది. ఒక పెను తుపానులో రెండు ఇళ్లు సముద్రంలో కొట్టుకుపోయాయి. అన్నీ కోల్పోయి ఒకడు ఏడుస్తుంటే.. ఇంకొకడు ఏదో చెట్టు కొమ్మను పట్టుకుని వేలాడుతూ నవ్వుతూ కనిపిస్తాడు. ఒకడు కుంగిపోతాడు. మరొకడు బతికాననుకుంటాడు. మీకు నెగెటివ్ మైండ్ ఉంటే దీవెనలు కూడా దరిద్రంగా అనిపిస్తాయి. అదే మీరు కాన్షియస్ మైండ్ (స్పృహతో ఉన్న మనసు)తో ఉంటే కష్టాలు కూడా అవకాశాల్లా కనిపిస్తాయి. ప్రపంచంలో ఏదీ నీకు మాత్రమే వ్యతిరేకంగా జరగదు. ప్రపంచంలో ఏవేవో జరుగుతుంటాయి. అందులో నువ్వు కూడా ఉన్నావంతే. అలాంటప్పుడే మన యాటిట్యూడ్ సాయం చేస్తుంది. ఆ తుపానులో నువ్వు బాధ పడతావా? అనుభూతి చెందుతావా? అన్నది నీ ఇష్టం. ప్రతి దానికీ కంప్లైంట్ చేసుకుంటూ పోతే నీకే నష్టం. ఎప్పుడూ ఏడుస్తూ బతకాలి అని అనుకున్న వారికి చుట్టూ వేల కారణాలు కనిపిస్తాయి. బయట జరిగేదేదీ మన చేతిలో ఉండదు. కానీ, దానిపై ఎలా స్పందించాలనేది మాత్రం మన చేతిలోనే ఉంటుంది. రైట్ యాటిట్యూడ్ ఉన్నోడిని ఎవరూ ఓడించలేరు. ఎందుకంటే వాడు జీవితానికి ఎదురెళ్లడు. జీవితమనే నదిలో ఒదిగిపోతూ కొట్టుకుపోతున్నాడు.



## అఖిల్ కంబ్యాక్ ఫిక్స్?.. "మనోడు వస్తున్నాడు" టీజర్ వైరల్


టాలీవుడ్‌లో మోస్ట్ స్టైలిష్ యాక్షన్ హీరోగా గుర్తింపు తెచ్చుకోవడానికి ట్రై చేస్తున్న అఖిల్.. ఈసారి 'లెనిన్' (Lenin) అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్నారు. ఒక ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా రిలీజ్ డేట్ గ్లింప్స్‌ను నాగార్జున కెరీర్ బిగినింగ్ డే (మే 23) రోజే ప్లాన్ చేసి అఖిల్ తన తండ్రికి ఒక మెమరబుల్ గిఫ్ట్ ఇచ్చాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ వచ్చే నెల జూన్ 26న (June 26th) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది అని తెలుపుతూ..

ఈ సినిమా నుండి టీజర్ వదిలారు. ప్రమోషన్స్ కోసం వాడుతున్న '#ManoduVasthunnadu' అనే ట్యాగ్‌లైన్ మాస్ ఆడియన్స్‌కు విపరీతంగా కనెక్ట్ అయిపోయింది. అఖిల్ కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ ట్యాగ్ ఫుల్ జోష్ ఇచ్చింది. సమ్మర్ ముగిసే సమయానికి, పక్కా ప్లానింగ్‌తో జూన్ 26న ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తెస్తున్నారు. ఈ గ్లింప్స్ వీడియోలో అఖిల్ మేకోవర్, యాక్షన్ షాట్స్ చాలా స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల టాక్. తండ్రి నాగార్జున నటించిన మైల్‌స్టోన్ హిట్స్ (శివ, జేమ్స్ బాండ్ లాంటి క్యారెక్టర్స్) షేడ్స్ గుర్తుకు వచ్చేలా అఖిల్ ఈ 'లెనిన్' క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. అందుకే నాగ్ కూడా ఈ వీడియో చూస్తుంటే 'చాలా హాయిగా ఉంది' అంటూ మురిసిపోయారు. ఒక వైపు నాగ్ 40 ఏళ్ల సినీ ప్రస్థానానికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు అఖిల్ సినిమాపై అంచనాలు స్కై హైకి చేరాయి. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు, టీజర్/ట్రైలర్ అప్‌డేట్స్ మరికొద్ది రోజుల్లోనే చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించనుంది.

# జాన్వీకి కీలకంగా మారిన 'పెద్ది'.. ఈసారైనా మెప్పిస్తుందా?

హిందీ సినీ పరిశ్రమలో మంచి గుర్తింపును సంపాదించుకున్న తర్వాత జాన్వీ కపూర్, దేవర : పార్ట్ 1 చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా విడుదలకు ముందు ఆమె పాత్రపై ప్రేక్షకులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రచార చిత్రాల్లో జాన్వీ తన గ్లామర్‌తో ఆకట్టుకోవడంతో, నటన పరంగా కూడా మెప్పిస్తే తెలుగులో ఈ ముద్దుగుమ్మకు తిరుగుండదని అప్పట్లో చాలామంది అభిప్రాయపడ్డారు. అయితే, 'దేవర' చిత్రంలో జాన్వీ పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోయింది. ముఖ్యంగా సెకండాఫ్‌లో వచ్చే ఆమె పాత్ర, గ్లామర్‌కు మాత్రమే పరిమితమైందనే విమర్శలు వినిపించాయి.

నటనకు పెద్దగా స్కోప్ లేకపోవడంతో ఆమె తన ప్రతిభను పూర్తిగా చూపించలేకపోయిందని కొందరు భావించారు. ప్రస్తుతం జాన్వీ 'పెద్ది' చిత్రంలో హీరోయిన్గా నటిస్తోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాల్లో కూడా ఆమె గ్లామర్‌తోనే ఆకట్టుకుంటోంది. దీంతో ఈసారి అయినా నటన పరంగా బలమైన ప్రదర్శన ఇస్తే తెలుగులో వరుస అవకాశాలు దక్కే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే కేవలం గ్లామర్‌కే పరిమితమైతే అవకాశాలు తగ్గుముఖం పట్టే ఛాన్స్ కూడా ఉందని చెబుతున్నారు. దాంతో జాన్వీ కపూర్‌కు 'పెద్ది' సినిమా కీలకంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.





# 'సలార్ 2' సెట్స్‌పైకి అప్పుడే!

ప్రస్తుతం ప్రభాస్ చేతిలో మూడు సినిమాలున్నాయి. వీటిలో 'ఫౌజీ' ముగింపు దశలో ఉండగా.. 'స్పిరిట్', 'కల్కి..' సీక్వెల్ చిత్రాలు ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్నాయి. దీనితో పాటు 'సలార్ 2' చేయాల్సి ఉండగా.. ఇది ఉంటుందా అనే దానిపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఇక ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ తాను త్వరలో ఓ మైథలాజికల్ సినిమా చేస్తానని చెప్పడంతో 'సలార్' సీక్వెల్ ఉండకపోవచ్చేమోనన్న ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో ఈ అంశంపై దర్శకుడు ప్రశాంత్ స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తాను ఎన్టీఆర్‌తో చేస్తున్న 'డ్రాగన్' పూర్తి కాగానే.. 'సలార్ 2' ప్రారంభమవుతుందని వెల్లడించారు. దీంతో ఇదిప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం ప్రశాంత్ ఎన్టీఆర్ కలయికలో వస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది ఆరంభం కల్లా పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఈలోగా ప్రభాస్ కూడా 'ఫౌజీ'తో పాటు 'స్పిరిట్'ని ముగించే అవకాశముంది. కాబట్టి 'సలార్ 2: శౌర్యాంగపర్వం' 2027 చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లొచ్చని సంకేతాలందుతున్నాయి.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 24-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.